ప్రజాశక్తి

ఆదివారం 28 జులై 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





భూకబ్జాలపై రగడ

- టిడిపి, వైసిపి సభ్యులు పరస్పర ఆరోపణలు ◆ వాడివేడిగా జెడ్‌పి సమావేశం
- యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు లేవనెత్తిన అంశంతో రచ్చ
- 'సూపర్ సిక్స్' ఎప్పుడంటూ వైసిపి సభ్యులు పట్టు ◆ వ్యవసాయం, ఆరోగ్య అంశాలపై చర్చ
- గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జెడ్‌పిటిసి డిమాండ్



వాగ్వాదానికి దిగిన జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే విజయకుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా జరిగిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. భూకబ్జాలపై పరస్పర ఆరోపణలతో రగడగా మారింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో రెండు మినహా అన్ని అసెంబ్లీ స్థానాల్లో కూటమి ఎమ్మెల్యేలు ఎన్నిక కావడంతో వారందరికీ జిల్లా పరిషత్‌లో స్థాయీ సంఘ సభ్యులుగా అవకాశం వచ్చింది. దీంతో శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన పరిషత్ అసెంబ్లీ హాల్‌లో జరిగిన సమావేశంలో వ్యవసాయం, ఆరోగ్య అంశాలపై ముందుగా చర్చించారు. చర్చలు ప్రారంభమైన వెంటనే అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి డి.గంగరాజు, కొయ్యూరు జెడ్‌పిటిసి నూకరాజు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో వ్యవసాయ శాఖ పనితీరు బాగులేదని, రైతులకు సరఫరా చేసిన వరి విత్తనాలు మొలకెత్తకుండా పోయాయని, గిరి రైతులు తీవ్రంగా నష్టపోయారని సభ దృష్టికి తెచ్చారు. పంట నష్టం వాటిల్లిన జీడికి పరిహారం అందలేదన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైనా ఇప్పటికీ రాజ్మా, రాగుల విత్తనాల సరఫరా జరగలేదని గంగరాజు ప్రస్తావించారు. అనకాపల్లి జిల్లాలో వ్యవసాయ శాఖ ద్వారా అమ్మకాలు చేసిన వరి విత్తనాలు మొలకెత్తలేదని కొంతమంది సభ్యులు చెప్పారు. అలాంటి 40 బస్తాలను వెనక్కి పంపామని అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి బదులిచ్చారు.

రైతు భరోసా ఎప్పుడు ?

ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినప్పటికీ రైతుల కు రైతు భరోసా సొమ్ము ఈనాటికీ జమ చేయలేదని, ఇంకా ఎప్పుడు జమ చేస్తారని కొందరు జెడ్‌పిటిసి ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రాలేదని విశాఖ జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి చెప్పారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఫ్యాక్టరీ మూతపడదని, మిగతా 2లో..



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, వేదికపై జగ్గునాయుడు

నర్సీపట్నంలో..

డిసెంబర్ 8, 9న సిపిఎం జిల్లా మహాసభ

- ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి
- వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- పార్టీ అనకాపల్లి జిల్లా ప్లీనం డిమాండ్

ప్రజాశక్తి - అనకాపల్లి : సిపిఎం అనకాపల్లి జిల్లా మహాసభ డిసెంబర్ 8, 9 తేదీల్లో నర్సీపట్నంలో జరుగ నున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. పార్టీ జిల్లా ప్లీనం శనివారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు అధ్యక్షతన అనకాపల్లిలోని దొడ్డి రామునాయుడు భవన్‌లో జరిగింది. ముఖ్యవక్తగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గునాయుడు హాజరయ్యారు. తొలుత జిల్లా మహాసభలను నర్సీపట్నంలో నిర్వహించడానికి లోకనాథం ప్రతిపాదించారు. అలాగే ఉపాధి హామీ బకాయిలు అందించాలని, ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని తీర్మానాలు పెట్టారు. ప్లీనంలో వాటిని ప్రతినిధులు ఆమోదించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కూలీలకు తక్షణమే బకాయిలు చెల్లించాలని ప్లీనం డిమాండ్ చేసింది. వ్యవసాయధారిత జిల్లాలో వ్యవసాయ పనుల్లేక ఉపాధి హామీ పనులపై కూలీలు ఆధారపడి బతుకుతున్నారని, జిల్లాలో 2.78 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయని, 3.09 లక్షల మంది కూలీలు పనిచేస్తున్నారని పేర్కొంటూ చట్టం ప్రకారం చేసిన పనికి రెండు వారాల్లోగా కూలి చెల్లించాల్సి మిగతా 2లో..

300 కిలోల గంజాయి పట్టివేత

▶ వార్త మెయిన్‌లో..

ఐక్య పోరాటాలతో ఉక్కును కాపాడుకుంటాం

▶ వార్త మెయిన్‌లో..

పోర్టు ఆసుపత్రిని పిపిపికి ఇవ్వొద్దు

▶ వార్త 8లో..



చిన్నారులను తల్లి చెంతకు చేర్చిన పోలీసులు

చిన్నారుల కిడ్నాప్ కేసు ఛేదన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెందుర్తి ప్రాంతంలో చిన్నారుల కిడ్నాప్ కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. వివరాల్లోకి వెళితే ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లా కాళికట్ ప్రాంతానికి చెందిన మినతి ప్రధాన్ పిల్లలతో సహా పెందుర్తి నియోజకవర్గంలోని నరవలో కూలి పనులు చేసుకుంటూ నివాసం ఉంటోంది. అదే రాష్ట్రానికి చెందిన ముద్దాయి వాసు దేవ జెల్లీ కూడా నరవలో ఉంటూ కూలీపనులు చేసుకుంటున్నాడు. మినతి ప్రధాన్‌కు సోదరి ఉంది. కొద్దిపాటి పరిచయంతో నిందితుడు ఆమె సోదరిని తనకు ఇచ్చి వివాహం చేయాలని మిగతా 2లో..

జివిఎంసి స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో..

అన్ని స్థానాల్లో పోటీ

కూటమి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల సమావేశం నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆగస్టు 7న జరిగే జివిఎంసి స్టాండింగ్ కౌన్సిల్‌లోని మొత్తం పది స్థానాల నుంచి టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులను పోటీకి నిలపాలని శనివారం దసపల్లా హోటల్‌లో జరిగిన కూటమి ఎమ్మెల్యేల, కార్పొరేటర్ల సమావేశం నిర్ణయించింది. జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్ బాబు, పి.గణబాబు, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి తదితరులు పాల్గొన్నారు. స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల కోసం సోమవారం నామినేషన్లను దాఖలు చేయవలసి ఉంటుందని, ఈలోగా కూటమిలోని శాసనసభ్యులు వారి పరిధిలోని కూటమి కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి, వారందరి అభిప్రాయంతో ఒక్కొక్క ఎమ్మెల్యే ఒక్కొక్క అభ్యర్థిని స్టాండింగ్ కౌన్సిల్‌కు ఎంపిక చేయాలని నిర్ణయించారు. అలా నిర్ణయించబడిన అభ్యర్థికి కార్పొరేటర్లు అందరూ సహకరించి, ఆ కార్పొరేటర్ గెలుపునకు కృషి చేయాలని, స్టాండింగ్ కౌన్సిల్‌కు పోటీ చేసే అవకాశం దక్కలేదని ఏ ఒక్కరూ అసంతృప్తి వ్యక్తపరచకూడదని అన్నారు. రాష్ట్రంలో కూటమికి 63 శాతం ప్రజలు మద్దతు తెలిపారని, జివిఎంసి పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలలో కూటమి అభ్యర్థులు భారీ ఆధిక్యతతో విజయాలను అందుకున్నారని, ప్రజాభిప్రాయం కూటమికి అనుకూలంగా ఉందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జివిఎంసిలో స్టాండింగ్ కౌన్సిల్‌తో పాటు మేయర్ పీఠం కూడా దక్కించుకునేలా అందరూ పనిచేయాలని నిర్ణయించారు. స్టాండింగ్ కౌన్సిల్‌లో గెలుపొందడం ద్వారా వార్డులలో అభివృద్ధి పనులను జరిపించుకోవడంతోపాటు ప్రశ్నించే అవకాశం గట్టిగా వస్తుందని గంటా శ్రీనివాసరావు ఈ సందర్భంగా తెలిపారు. కూటమి బలం తక్కువగా ఉందని భావించవద్దని, ఒకటి రెండు రోజులలో మరికొంతమంది కార్పొరేటర్లు కూటమిలో చేరబోతున్నారని ఎమ్మెల్యేలు భరోసా ఇచ్చారు. స్టాండింగ్ కౌన్సిల్‌కు పోటీ చేసే అభ్యర్థులంతా సోమవారం నామినేషన్లు దాఖలు చేయాలని నిర్ణయించారు.

మొదటి పేజీ తరువాయి..

భూకబ్జాలపై రగడ

రైతులకు మేలు జరుగుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు మాట్లాడుతూ గతంలో గంధవరంలో ఏర్పాటు చేయతలపెట్టిన విత్తన పరిశోధన కేంద్రం నిలిచిపోయిందని, త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ సానుకూలంగా స్పందించారు. ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లాలో వరదలకు నష్టపోయిన పంటలకు పరిహారాన్ని తక్షణమే ఇవ్వాలని వైసిపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి కోరారు.

అంశాలవారీగా విభజించి సమావేశాలు పెట్టండి

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ అజెండాలో అన్ని అంశాలపై ఒకేరోజు చర్చ కాకుండా అంశాలను విభజించి సమావేశాలు నిర్వహించడం మంచిదని, ఇందువల్ల చర్చ బాగా సాగుతుందని, సమయం కలిసి వస్తుందని తెలిపారు. అజెండాలో అన్ని అంశాలూ కాకుండా 3, 4 అంశాలతోనే సమావేశం ముగుస్తోందని, దీనివల్ల ప్రయోజనం లేకుండా పోతోందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒకటి, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు కలిపి ఒకటి సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలని సూచించారు. దీనిపై జెడ్‌పి సిఇఒ పోలినాయుడు స్పందిస్తూ అలా నిర్వహించడం సాంకేతికంగా సాధ్యం కాదని, కోరం సమస్య తలెత్తుతుందని, అయినప్పటికీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని సమాధానం చెప్పారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జెడ్‌పి స్కూళ్లలో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని కోరారు. అంశాలవారీగా చర్చ సాగుతున్న సమయంలో యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో కొండకర్ల జిల్లా పరిషత్తు హైస్కూల్ స్థలం కబ్జాకు గురికాగా తాము పోరాడి అడ్డుకున్నామని చెప్పారు. ఇటువంటి దురాగతాలు గత ప్రభుత్వంలో మరికొన్ని జరిగాయని వాటిని కూడా వెలికి తీస్తామని చెప్పారు. కొండకర్ల ప్రాంతానికి చెందిన జెడ్‌పిటిసి కో – ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యలమంచిలి ఎమ్మెల్యే పేరు చెప్పుకొని తమ ప్రాంతంలో కొందరు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనికి ఎమ్మెల్యే విజయ కుమార్ తీవ్రస్థాయిలో స్పందించి ఆయనపై ఆగ్రహం వ్యక్తపరిచారు. తప్పుడు ఆరోపణలు చేయవద్దని, అటువంటి వాటిని సాగనిచ్చేది లేదని చెప్పారు. తాను నిరూపిస్తానని జెడ్‌పిటిసి కుమార్ చెప్పడంతో గొడవ జరిగింది. ఎమ్మెల్యే విజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ గత ప్రభుత్వంలో కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం జరిగాయని, వాటిలో అధికార పార్టీ వారే ఎక్కువ మంది ఉన్నారని చెప్పడంతో వైసిపికి చెందిన జెడ్‌పిటిసి సభ్యులు మూకుమ్మడిగా ఎమ్మెల్యే కూర్చున్న స్థానానికి వచ్చి ఆయనతో వాగ్వాదానికి దిగారు. బుచ్చయ్యపేట జెడ్‌పిటిసి దొండా రాంబాబు మాట్లాడుతూ జెడ్‌పి సమావేశంలో రాజకీయాలు మాట్లాడటం సరికాదని, ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే అందరం చర్చించి పరిష్కారం చూపుదామని అన్నారు. ఆయనపైనా విజయకుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో సమావేశం మరింత ఉద్రిక్తంగా మారింది. సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటిని ఎందుకు అమలు చేయటం లేదని, ఆ పథకాలు ఎప్పుడు అందుతాయని జెడ్‌పి వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు ప్రశ్నించారు.

విజయకుమార్ వ్యాఖ్యలు సరైనవి కావు : జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర వేదిక నుంచి కిందకు వచ్చి ఎమ్మెల్యే విజయకుమార్ వ్యాఖ్యలు సరైనవి కాదని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆమెకు వైసిపి జెడ్‌పిటిసిలు మద్దతు తెలిపారు. వారంతా ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌పైకి దూసుకు వెళ్లారు. వైసిపి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే కేంద్రంతో పాటు రైతు భరోసా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసేదని, కూటమి ప్రభుత్వం ఇప్పటిదాకా జమ చేయలేదని, ఇది వాస్తవం కాదా ? అని నిలదీశారు. దీంతో సుమారు గంటసేపు సమావేశంలో రచ్చ సాగింది. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జోక్యం చేసుకొని ఇరుగ్రూపులకూ సర్ది చెప్పడంతో రగడ సద్దుమణిగింది. తదుపరి అంశాలను చర్చించడం కోసం సమావేశాన్ని మధ్యాహ్నానికి వాయిదా వేసి కొనసాగించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన రావికమతం జెడ్‌పిటిసి తలారి రమణమ్మకు నివాళ్లర్పించారు. సమావేశంలో అరకు, పాడేరు ఎమ్మెల్యేలు రేగ మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ వి.చిరంజీవిరావు, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, విజయ కృష్ణన్, దినేష్ కుమార్, అధికారులు పాల్గొన్నారు. అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలను సభ్యులు సత్కరించారు.

సమస్యలపై గళం విప్పిన సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు



మాట్లాడుతున్న గంగరాజు

సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు డి.గంగరాజు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులు తీవ్రంగా ప్రబలి గిరిజనులు రోగాల బారిన పడుతున్నారని, వారికి సరైన వైద్యం అందడం లేదని తెలిపారు. సంబంధిత అధికారులు దీనిపై తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతగిరి మండలం వెంకయ్య పాలెం ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయుడును నియమించాలని డిమాండ్ చేయగా సదరు అధికారి స్పందిస్తూ సోమవారం నుంచి ఉపాధ్యాయుడు వస్తారని సమాధానమిచ్చారు. అనంతరం గంగరాజు మాట్లాడుతూ సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని కోరారు. బొర్రా కేవ్స్‌కు ఆనుకొని అక్రమంగా నిర్మించిన జిప్ లైన్‌ను ఐటిడిఎ లేదా పంచాయతీ స్వాధీనం చేసుకోవాలన్నారు. .జిప్ లైన్ నుంచి వసూలు చేసిన రూ.2 కోట్లా 51 లక్షలను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌పై కూటమి చోద్యం

దర్పణం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికే కాదు, ఉత్తరాంధ్రకూ అన్యాయం చేసింది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరిస్తామనిగానీ, సొంత గనులు కేటాయిస్తామనిగానీ కేంద్రం హామీ ఇవ్వలేదు. విభజన చట్టం ప్రకారం విశాఖ రైల్వే జోన్ అంశమే ప్రస్తావించలేదు. జిల్లా తలకొరికినట్లు ఎన్‌డిఎ ప్రభుత్వ బడ్జెట్ వున్నా, బాగుందని కూటమి ప్రభుత్వం, జిల్లాలోని టిడిపి, జనసేన, బిజెపి నాయకత్వం కీర్తించడం హాస్యాస్పదం, మోడీతో కలిసి ఏ పనైనా చేయగలనని బీరాలు పలికిన జనసేన అధినేత ఎంత అన్యాయం చేసినా మౌనం వీడ్డంలేదు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపలేక మాట్లాడ్డంలేదో, ప్రయివేటీకరణ చేయడం మంచిదని అనుకొని గొంతు విప్పడంలేదో తెలీదుగానీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మౌనం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయిస్తామని హామీ ఇవ్వడంలోనూ దగా తప్ప ధర్మం లేదు. కొన్నేళ్లుగా వెనుకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన నిధులు నిలిపివేసి, మళ్లీ ఇప్పుడు నిధులు ఇస్తామని చెప్పడం నమ్మశక్యంగా లేదు. ఆ మాటల్లోనే స్వచ్ఛత లేదు. వెనుకబడిన జిల్లాలకు ఎప్పటి నుంచి ఎంత చొప్పున నిధులు విడుదలచేస్తామని చెప్పలేదు. ఈ ప్రాంతాల అభివృద్ధికి కేటాయించిన నిధులు వెల్లడించలేదు.

జిల్లాకు ఒనగూరే నష్టంపై మాట్లాడని పార్టీలు, తమ లాభంపైనే ఆలోచించినట్లుంది. వైసిపికి చెందిన 12 మంది కార్పొరేటర్లు కొద్ది రోజుల క్రితం టిడిపి, జనసేనలో చేరారు. మెజార్టీ కార్పొరేటర్లు వైసిపికి చెందినవారైనా, సార్వత్రిక ఎన్నికల తరువాత మారిన ప్రభుత్వాలతో తమ ఆలోచనలు మార్చుకుంటున్నారు. ఎక్కడుంటే లాభదాయకంగా వుంటుందో అక్కడకు దూకడం తప్ప నగర అభివృద్ధి వీరికి పట్టినట్లులేదు. రాజకీయంగా ఎన్ని గెంతులు వేసినా, ఎన్ని జెండాలు మార్చినా ప్రజల సమస్యలేవీ ప్రధాన రాజకీయ పార్టీలైనా టిడిపి, జనసేన, వైసిపి, బిజెపికి పట్టడంలేదు. వివిధ అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం విశాఖపట్నంలోని ప్రభుత్వ భూ అక్రమణలపై నియమించిన సిట్ సమర్పించిన నివేదికను బయటపెట్టడం లేదు. గతంలో వైసిపి కూడా అలాగే చేసింది. ఆ నివేదికను బయటపెట్టివుంటే ఈ పార్టీల్లోని భూ కబ్జాదారులు బయటపడివుండేవారు. సిట్ నివేదికను బయటపెట్టాలని సిపిఎం, వామపక్షాలు తప్ప మిగిలిన రాజకీయ పార్టీలేవీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయకపోవడంలోనే వాటి నైజం బోధపడుతుంది.

చిన్నారుల కిడ్నాప్ కేసు ఛేదన

(మొదటి పేజీ తరువాయి..)

కోరాడు అందుకు ఆమె నిరాకరించడంతో ఈ నెల 18న మినతి ప్రధాన్ పిల్లలు ఇద్దరినీ కిడ్నాప్ చేసి తరలించుకుపోయాడు. తల్లి అదే రోజు సాయంత్రం కూలి పని అనంతరం ఇంటికి వచ్చి చూసే సరికి ఇద్దరు పిల్లలు కనపడలేదు. దీంతో ఒడిశాలో ఫిర్యాదు చేసింది. వెంటనే అక్కడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్.నమోదు చేసి పెందుర్తి పోలీసులకు కేసును బదలాయించారు ఇక్కడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 22న ఎస్ఐ సింహాచలం పోలీసు బృందాలను ఒడిశాకు పంపారు. నిందితుడు ఒక్క ఫోన్ కాల్ ఆధారంగా దొరికేశాడు. అతన్ని అదుపులోకి తీసుకొని పెందుర్తికి తరలించారు పిల్లలను తల్లికి అప్పజెప్పారు కేసును ఛేదించిన వారిని ఎసిపి అభినందించారు.

డిసెంబర్ 8, 9న సిపిఎం జిల్లా మహాసభ

(మొదటి పేజీ తరువాయి..) ఉంటుందని ప్లీనం గుర్తుచేసింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఎనిమిది నుంచి పది వారాలు దాటినా కూలీలకు బకాయిలు చెల్లించకపోవడంతో ఆ కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపింది. జిల్లాలో దాదాపు కూలీలకు ఉపాధి బకాయి రూ.40 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉందని పేర్కొంది. బకాయి వెంటనే చెల్లించి కూలీలను ఆదుకోవాలని కోరింది. కూలీలు కోరిన వెంటనే ఉపాధి పనులు అన్ని ప్రాంతాల్లో కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించింది. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు, ఆకుమడులు దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ప్లీనం డిమాండ్ చేసింది. 825 ఎకరాల్లో ఆకుమడులు దెబ్బతిన్నాయని, 2662 మంది రైతులు నష్టపోయారని తెలిపింది. రైతులకు అవసరమైన వరి విత్తనాలు ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేయాలని, పంట పెట్టుబడులకు సరిపడా పంట రుణాలు మంజూరు చేయాలని, అర్హులైన కౌలురైతులకు కార్డులు మంజూరుచేసి పంట రుణ సౌకర్యం కల్పించాలని, రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉంచాలని డిమాండ్ చేసింది. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, డి.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లాలో ఉన్న అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా పార్కు స్థలం!

- దుర్వాసనతో రాజేంద్రనగర్‌వాసుల అవస్థలు
- ప్రభుత్వ నిరాదరణతో నిరుపయోగం
- కబ్జా కోరల్లో చిక్కుకోకముందే సద్వినియోగం చేయాలని స్థానికుల వినతి
- పట్టించుకోని అధికారులు, నేతలు



రాజేంద్రనగర్‌లో చెత్తా చెదారంతో నిండి ఉన్న పార్కు స్థలం

ప్రజాశక్తి- సీతమ్మధార: నగరం నడిబొడ్డున రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం నిర్లక్ష్యానికి గురైంది జీవీఎంసీ 25 వార్డు సీతంపేట మెయిన్ రోడ్డు సమీపంలోని రాజేంద్రనగర్‌లో ప్రిజం కాలేజ్ ఎదురుగా ఉన్న పార్కు స్థలం నిరుపయోగంగా మారింది. నేడు డంపింగ్ యార్డ్‌ను తలపిస్తుంది. పార్కు స్థలాన్ని పట్టించుకునే నాధుడే లేక చెత్తచెదారంతో నిండిపోయింది. దీంతో ఖాళీగా ఉన్న ఈ స్థలంలో రహదారుల ఆక్రమణలో తొలగించిన బడ్డీలు, హోర్డింగ్‌లు, మూలకు చేరిన వాహనాలకు నెలవుగా మారిపోయి ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు స్థలాన్ని, ఇపుడు బహిరంగ మూలమూత్ర విసర్జనలతో తీవ్ర దుర్వాసనతో పార్కు స్థలం అధ్వానంగా మారింది. సీతంపేటలోని గొల్ల వీధి, హరిజన వీధి, గణేష్ నగర్, శ్రీహరి వీధి, ముద్ద వీధి, కనకమ వీధి, రెల్లి వీధి, బిటిఆర్ నగర్ ఇవన్నీ 25 వార్డులో పరిధిలోకి ఈ ప్రాంతాలన్నీ నాన్ ప్లానింగ్ ఏరియా కిందకు వస్తాయి. ఇక్కడ సరైన రహదారులు లేవు. ఆటవిడుపుగా కాసేపు సేదదీరేందుకు పార్కులు కూడా. కనీసం లేవు శుభకార్యాలు వేడుకలు జరుపుకోవడానికి సామాజిక భవనాలు, కళ్యాణ మండపాలు లేవు. రైతు బజార్ లేదు. దగ్గర్లో ప్రభుత్వ ఆసుపత్రి లేదు నాలుగు ఐదు అడుగుల రోడ్లతో ఇరుకు సందులతో ఈప్రాంతం ఉంది. నిటారుగా చేయి ఎత్తితే తగిలేంత కిందకి, గా విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతూ ఉంటాయి. ఏదైనా అత్యవసరమైతే కనీసం అంబులెన్స్ వచ్చే సదుపాయం కూడా లేదు. వార్డు పరిధిలో శుభకార్యాలు, ఇతర ఏ చిన్న ఫంక్షన్ జరుపుకోవాలన్న సరైన స్థలం లేకపోవడంతో రోడ్డు ఎక్కాల్సిందే.

నగర నడిబొడ్డున ఉన్న వార్డులోని ఈ ప్రాంతంలో ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న పార్కు స్థలాన్ని బాగుచేస్తే ఆయా ప్రజా అవసరాలకు వినియోగించుకునే వీలుంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు, మరోవైపు ఇదే స్థలంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు, దుర్గంధాల నుంచి విముక్తి లభిస్తుందని స్థానికులు అభిప్రాయ ఎపడుతున్నారు. స్మార్ట్ సిటీగా గుర్తింపు పొందిన విశాఖ మహానగరంలో నడిబొడ్డున ఉన్న ఈ పార్కు స్థలం అధికారుల నిర్లక్ష్యం వల్ల మచ్చుగానే కనిపిస్తోందని స్థానికులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న ఈ పార్కు స్థలంపై కబ్జాదారుల కన్నుపడి, దొంగ పత్రాలను సృష్టించి కాజేయకముందే, దీన్ని ఏదో ఒకరకమైన ప్రజోపయోగ కార్యానికి వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు. వార్డు ప్రజల అవసరాలకు తగినట్టు రాజేంద్రనగర్ పార్కు స్థలంలో రైతు బజార్ గానీ, కళ్యాణ మండపం గానీ, ఇంకా ఏదైనా సామాజిక అవసరాలకు వినియోగించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అంతేకాకుండా ఆహ్లాదకర పార్కుగా తీర్చిదిద్దితే వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలతోపాటు ప్రజలు ఉపశమనం కలిగించే ప్రాంతంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

గీతం దూర విద్య కోర్సులలో అడ్మిషన్లు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఇఇ)ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో ఎంఎ ఇంగ్లీష్, ఎంబిఎ, బిఎ, బికాం డిగ్రీ కోర్సులలో 2024 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డైరక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. దూర విద్యావిధానంలో ఈ కోర్సులను అభ్యసించవచ్చుని, పూర్తి సమాచారం, ఆన్‌లైన్ దరఖాస్తులకు గీతం వెబ్‌సైట్ www.gitam.eduను పరిశీలించాలని సూచించారు.. పూర్తి చేసిన దరఖాస్తులను ఆగష్టు 31 తేదీలోగా అందజేయాలన్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 31న కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ శనివారం ప్రకటనలో తెలిపారు. సిసిపి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల్లో తక్షణ ప్రవేశాలు పొందవచ్చున్నారు. ఎస్ఎస్‌సి మార్కుల జాబితా, పాలిసెట్, 2024 హాల్ టిక్కెట్, టిసి, కుల ధృవీకరణ, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ ఒరిజినల్, మూడు జతల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌ఫొటోలు, రూ5,800 ఫీజుతో ఈ నెల 31న ఉదయం 9.30 గంటలకు కళాశాలకు హాజరు కావాలని తెలిపారు

న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి -తగరపువలస : తాత తండ్రుల నుంచి తమ ఆధీనంలో ఉన్న 5.06ఎకరాల ఇనాం భూమిని కారు చౌకగా కాజేసేందుకు గ్రామానికి చెందిన ఓ పెద్ద మనిషి ప్రయత్నిస్తున్నట్లు భీమిలి మండలం, నారాయణ రాజు పేట గ్రామానికి చెందిన. రైతులు గాడు రామసూరప్పడు, సన్యాసప్పడు, సురేష్, ఎం సూరి అప్పయ్యమ్మ, బి పెంటమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమికి ఎక్కువమొత్తంలో డబ్బులు ఇప్పిస్తానని నమ్మబలికి భూపత్రాలను తీసుకుని వ్యాపారం చేసిన లబ్ధి పొందిన ఆ వ్యక్తి, ఇపుడు ఆ భూమి తనదేనంటూ తమకు లీగల్ నోటీసులు పంపాడని వాపోయారు.ప్రస్తుతం అదే భూమిలో తాము వేరుశనగ పంట సాగుచేశామని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

మాధ్యమం తేడాతో విద్యార్థుల అయోమయం

అధ్యాపకులు లేక రెడ్డిపల్లి జూనియర్ కాలేజీలో విద్యాబోధనకు అవస్థలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లిలో ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటైందన్న సంతోషం అక్కడి విద్యార్థులు, తల్లిదండ్రుల్లో లేకపోయింది. కొత్త కాలేజీకి వసతి లేకపోవడంతో స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ ఏడాది ప్రారంభించారు. 36మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. అంతవరకు బాగానే ఉన్నా, ఇక్కడ కాలేజీలో ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన చేస్తుండడంతో, ఇప్పటివరకు తెలుగుమీడియంలో పాఠాలు చదివి వచ్చిన విద్యార్థులకు అర్థం కాక, అగమ్యగోచరమైన పరిస్థితి ఉంది. జూనియర్ లెక్చరర్ల నియామకాలు చేపట్టనప్పటికీ, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో అదనంగా ఉన్న ఎనిమిది మంది ఉపాధ్యాయులను ఈ కాలేజీకి డిఇఒ నియమించారు. వారిలో ఇప్పటి వరకు కేవలం ఇద్దరు మాత్రమే జాయిన్ అయ్యారు. ఇక విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం పాఠ్యపుస్తకాలను అందజేయడంతో, వచ్చిన ఇద్దరు అధ్యాపకులు ఆంగ్లమాధ్యమంలోనే పాఠాలను బోధిస్తున్నారు. దీంతో వారు చెప్పిన పాఠాలు అర్థంకాక విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమై, రెండు నెలలు గడిచిపోవడం, అటు అధ్యాపకులు లేక, ఇటు ఉన్న ఇద్దరు చెప్పిందేమిటో అర్థంకాక గందరగోళ పరిస్థితులు నెలకొన్న రెడ్డిపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీపై విద్యాశాఖ అధికారులు దృష్టిపెట్టి, తెలుగు మీడియం పాఠ్యపుస్తకాలు పంపిణీ, అధ్యాపకుల పోస్టుల భర్తీ, ఇతర చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు స్థానికులు కోరుతున్నారు.

కృష్ణానగర్‌లో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఎనిమిదో వార్డు పరిధిలోని అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను శనివారం రెవిన్యూ అధికారులు తొలగించారు. రెవిన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం '22ఎ'లో నమోదై ఉన్న కృష్ణానగర్ లేఅవుట్‌లోఉన్న కొన్ని ఖాళీ స్థలాలలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపట్టడంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వాటిని తొలగించామన్నారు. ఎంఆర్ఐ ప్రవీణ్ కుమార్, సచివాలయ విఆర్ఒ సూర్యకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ తహశీల్దార్‌కు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-పద్మనాభం: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో బదిలీ తహశీల్దార్ వెంకటరావుకు కార్యాలయ సిబ్బంది, తదితరులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎన్నికల సందర్భంగా శ్రీకాకుళం జిల్లా నుంచి బదిలీపై వచ్చిన వెంకటరావు, ఇక్కడ ఎన్నికలను శాంతియుత నిర్వహణతోపాటు, ఇతర రెవెన్యూ సమస్యలపై ఐదు నెలలపాటు సమర్ధవంతమైన సేవలు అందించారు. ఈసందర్భంగావెంకటరావు మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు అన్నివిధాలా సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

వేములవలస వంతెన కింద 'నో పార్కింగ్'

ప్రజాశక్తి-ఆనందపురం : ట్రాఫిక్ ఇబ్బందులతో తరచూ ప్రమాదాలకు నెలవైన మండలంలోని వేములవలస బ్రిడ్జి సర్కిల్ వద్ద ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు ఆదేశాలతో శనివారం వేములవలస బ్రిడ్జ సర్కిల్ వద్ద నో పార్కింగ్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో వాహనాలు పార్కింగ్‌ను నిషేధించారు.ఎవరైనా నిబంధనలు అతిక్రమించి, పార్కింగ్ చేస్తే, రూ.1035 జరిమానా తప్పదని హెచ్చరిస్తూ బోర్డు పెట్టారు.. వాహనదారులు సహకరించాలని కోరారు.

పలు ప్రాంతాల్లో ఫాగింగ్

ప్రజాశక్తి- సీతమ్మధార : దోమల నిర్మూలనకు జివిఎంసి 25వ వార్డులోనిసీతంపేట, బిటిఆర్ కాలనీ, హరిజన వీధి, కనకమ్మ వీధి, గణేష్ నగర్, గొల్ల వీధి, చేపల బజార్, రాజేంద్రనగర్, శాంతిపురం, మధురానగర్, గురుద్వార హైవే తదితర ప్రాంతాల్లో మెగా ఫాగింగ్ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువ లేకుండా చూడాలని,జివిఎంసి మలేరియా సూపర్‌వైజర్ కేశవ సత్యనారాయణ, ఆపరేటర్ రాంబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో దివీస్ ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం, పెందుర్తి రహదారిలో దుక్కవానిపాలెం టోల్‌గేటు సమీపంలోని సర్వీస్ రోడ్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తగరపువలస దివిస్ ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి.గుంటూరుకు చెందిన ఉప్పల రాధాకృష్ణమూర్తి (49) తగరపువలసలో నివాసము అంటూ స్థానిక దివిస్ కంపెనీలో 25ఏళ్లుగా ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం కంపెనీ వ్యాన్‌లో గాజువాక నుండి ఆనందపురం వైపు వస్తుండగా, దుక్కవానిపాలెం టోల్‌గేట్ సమీపంలో వ్యాన్ ఆపి వాటర్ బాటిల్ కోసం రోడ్డు దాటుతుండగా ఆనందపురం వైపు నుండి వస్తున్న క్రేన్ అదుపుతప్పి ఢీ కొట్టింది, ఈ ప్రమాదంలో టైర్లు కిందపడి, తలకు తీవ్రగాయంతో రక్తస్రావమై మూర్తి అక్కడకక్కడే మృతి చెందారు.

అందిన సమాచారం మేరకు ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు, శాంతిభద్రతల ఎస్ఐ పందిరి శివ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు మూర్తికి భార్య ఉప్పల లక్ష్మీపరిమళ, పాప బాబు ఉన్నారు.ఆనందపురం సిఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎస్ఐ శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలానికి దివిస్ సిబ్బంది చేరుకొని, ప్రమాదవివరాలు సేకరించారు. తదుపరి చర్యల్లో పాల్గొన్నారు.

కాగా హైవేలోనూ, సర్వీస్‌రోడ్డులోనూ తరచూ ప్రమాదాలపై జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. కొండను దొలిచి, రోడ్డు నిర్మాణం చేపట్టారని, దీంతో ఎక్కడికక్కడే ప్రమాదకర, కానరాని మలుపులు ఉన్నాయి. దీంతో ప్రమాదాలకు ఆస్కారమేర్పడు తోందన్నారు. అధికారులు స్పందించి, స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు ద్వారా ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ప్రమాదం

- తప్పించుకోబోయి నేలపడిన బైకిస్టు
- లాఠీ విసిరారని యువకుల ఆందోళన

ప్రజాశక్తి - గాజువాక : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో హెల్మెట్ లేకుండా వెళుతున్న బైకిస్ట్ పోలీసుల నుంచి తప్పించుకుని వెళ్లే ప్రయత్నంతో రోడ్డుపై పడడంతో స్పృహ కోల్పోయిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. అయితే కానిస్టేబుల్ విసిరిన లాఠీ తగలడం వల్లే ప్రమాదానికి గురయ్యాడని స్థానిక యువకులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. దీనికి సంబంధించిన వివరాలివి.

శనివారం రాత్రి అమరావతి పార్కు వద్ద స్థానిక న్యూపోర్ట్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అదే మార్గంలో వస్తున్న ఒక బైకిస్ట్ హెల్మెట్ లేకుండా ఉండడంతో దాన్ని గమనించిన కానిస్టేబుల్ ఆపే ప్రయత్నం చేయగా, తప్పించుకుని పారిపోబోయాడు. ఈక్రమంలో అక్కడ రోడ్డుపై పడి స్పృహ కోల్పోయాడు. కాగా, అక్కడ విధుల్లో ఉన్న పోలీసు లాఠీ విసరడం వల్లే బైక్‌పై వెళుతున్న వ్యక్తికి ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ, కొంతమంది యువకులు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. అయితే అటువంటిదేమీ లేదని, పోలీసుల నుంచి తప్పించుకోవాలన్న ఆత్రంలోనే పడిపోయాడని పోలీసులు అంటున్నారు. దీనికి సంబంధించి వివరాలు బయటకు రాకుండా పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెత్తకుప్పలో శిశువు మృతదేహం

ప్రజాశక్తి -మధురవాడ: జివిఎంసి ఐదోవార్డు మారికవలస పిపి 2 కాలనీ రోడ్డులో శనివారం చెత్తకుప్పలో అప్పుడే పుట్టిన ఆడశిశువు మృతదేహం లభ్యమైంది. దీనిపై స్థానిక యుపిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చైతన్య తెలిపిన వివరాలివి. ఆరు నెలల గర్భిణికి ప్రీమెచ్యూర్ డెలివరీలో ఆడపిల్ల జన్మించి, మృతి చెందడంతో వారు ఆ మృతదేహాన్ని చెత్తకుప్పలో పడేసి ఉంటాయన్నారు. యుపిహెచ్‌సి పరిధిలోని వారా? లేక వేరే ప్రాంతానికి చెందిన వారు ఈ చర్యకు పాల్పడ్డారో గుర్తించేందుకు యుపిహెచ్‌సి పరిధిలోని గర్భిణుల వివరాలతో పోల్చి పరిశీలిస్తామన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పిఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.


రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పోరాటం



కెవిపిఎస్ మహాసభలో మాట్లాడుతున్న డాక్టర్ గంగారావు

ప్రజాశక్తి- ఉక్కునగరం: భారత రాజ్యాంగంతోపాటు వ్యక్తిగత హక్కుల పరిరక్షణకు పోరాటానికి సిద్ధం కావాలని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పిలుపునిచ్చారు. ఉక్కునగరం కార్యాలయంలో వి.ప్రకాశ్ వరకుమార్ ఆధ్యక్షతన కెవిపిఎస్ స్టీల్‌డివిజన్ 7వ మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సుబ్బన్న మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రజలందరూ సమస్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అధికారం కేవలం కొందరు చేతిలో కాకుండా, బడుగు బలహీన వర్గాల చేతికి అందినప్పుడే, అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తి సాకారమౌతుందన్నారు. సంఘం ఒబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ బహుజనులందరూ ఏకమై భారత రాజ్యాంగానికి స్ఫూర్తిని పరిరక్షించాలని కోరారు. స్టీల్ సిఐటియు మాజీ ప్రధానకార్యదర్శి ఎం.కృష్ణారావు మాట్లాడుతూ ఐక్య పోరాటాలతోనే బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధ్యమౌతుందన్నారు. అనంతరం 25 కార్యదర్శివర్గ సభ్యులు, కార్యవర్గ సభ్యులతో స్టీల్‌డివిజన్ కెవిపిఎస్ కార్యవర్గం ఎన్నిక జరిగింది.కార్యక్రమంలో టి.చిరంజీవి, కె.వెంకటరావు, వైటి.దాస్, త్రీన్ మూర్తిబాబు, యు.సత్యనారాయణ, బాలశౌరి పాల్గొన్నారు

బుల్లయ్య కాలేజీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపల్

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రపంచవ్యాప్తంగా వ్యాపార పారిశ్రామిక రూపకల్పన పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఓపెన్ గ్రూప్ అనే అంతర్జాతీయ సంస్థ ఏడు అంశాలతో నిర్వహించిన పోటీల్లో బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తాచాటి ప్రథమ బహుమతి సాధించారు. కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు మండపాక కామాక్షి, పద్మ వృత్తిక సారధ్యంలో పాల్గొన్న బృందానికి ఎం.రాజశేఖర్, వాసా అనిల్, మార్గదర్శనం చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఇ.మధుకుమార్ ప్రిన్సిపాల్ డి దీపక్ చౌదరి అభినందించారు.కాగా నీతి అయోగ్ ప్రారంభించిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో పాల్గొనేలా పాఠశాల స్థాయి విద్యార్థులకు మార్గదర్శనం చేసేందుకు బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ శారద విద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

సర్పంచ్‌ల భవిష్యత్ కార్యాచరణపై చర్చ

ప్రజాశక్తి- పద్మనాభం : సర్పంచ్‌ల భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్రకమిటీ సమావేశంలో చర్చించినట్లు సర్పంచ్‌ల సంఘం రాష్ట్రకార్యదర్శి, మండలంలోని అనంతవరం సర్పంచ్ జి.లక్ష్మి తెలిపారు. శనివారం విజయవాడలో బాలోత్సవ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో, సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు.అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగిందన్నారు.

ఎన్నికల తర్వాత జరిగిన మొదటి రాష్ట్ర కమిటీ సమావేశం కావడంతో పంచాయతీల విధులు, నిధులు, ఇతర అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారుసమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారన్నారు.

పేద నివాసితులకు న్యాయం చేయండి



ఎమ్మెల్యే పంచకర్లతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- పెందుర్తి : భూపోరాటంలో భాగంగా ఇళ్లను కట్టుకున్న పేదలకు ప్రభుత్వపరంగా న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్ సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి కోరారు. శనివారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కలిసి విన్నవించారు. పేదలు ఆక్రమించిన స్థలంలో ఇళ్ల పట్టాలు ఇవ్వడమో, లేకుంటే, ప్రత్యామ్నాయంగా వేరొక స్థలం చూపించాలని, లేకుంటే వారికి టిడ్కో ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యతనివ్వాలని కోరారు. దీనిపై పంచకర్ల స్పందిస్తూ, నిజమైన అర్హులకు తప్పక న్యాయం చేస్తామన్నారు. భూకబ్జాలు, ఆక్రమణలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, స్థానిక సమస్యలుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని, తానూ కలెక్టర్‌తో మాట్లాడతానని భరోసానిచ్చారు.

భూకబ్జాలపై ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తాం

భూకబ్జాలపై వారంలో ఏదోఒక రోజున ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాట చేయనున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రకటించారు భూకబ్జాలపై పత్రికలు, సోషల్‌మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్న నేపథ్యంలో శనివారం జివిఎంసి 97వ వార్డు సుజాతనగర్‌లోని ప్రైవేట్ కల్యాణ మండపంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఐదేళ్ల గత ప్రభుత్వ పాలనలో ఇష్టారాజ్యంగా భూకబ్జాలు జరిగాయని, వాటిపై చర్యలు ఉంటాయన్నారు. తన దృష్టికి వచ్చిన భూకబ్జాలపై వారంరోజుల్లోగా తగు చర్యలు తీసుకుంటానన్నారు. పంచగ్రామాల భూసమస్య కమిటీ పరిధిలో ఉందని, ఇది అతిత్వరలో కొలిక్కి రానుందన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన



ఐసిడిఎస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - ఆనందపురం : మహిళల రక్షణకు చట్టాలపై అవగాహన అవసరమని వేములవలసఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ అన్నారు. శనివారం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ మిషన్ శక్తిపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలకు ఆరోగ్య, సామాజికపరంగా రక్షణపై చైతన్యం అవసరమన్నారు. ఐద్వా నేత కె.నాగరాణి మాట్లాడుతూ

ప్రస్తుత సమాజంలో విపరీత ధోరణుల వల్ల మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. మహిళలకు గృహహింస, పోక్సో, ఇతర రక్షణ చట్టాలపైనా అలాగే ఆరోగ్య సంరక్షణపై అవగాహ కల్పించాలన్నారు. అనంతరం. భేటీ బచావో భేటీ పడావో నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో. భీమిలి సిడిపిఒ శ్రీదేవి, గంభీరం సెక్టార్ సూపర్‌వైజర్ పివి వెంకటరత్నం, హెచ్ఎం లక్ష్మణరావు, కోఆర్డినేటర్ ప్రమీలారాణి, అంగన్వాడి సిబ్బంది నదియా, కామాక్షి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

హెపటైటిస్ 'ఎ' వ్యాక్సినేషన్ అవసరం

డాక్టర్ ఫణికృష్ణ



ప్రజాశక్తి - ఆరిలోవ : హెపటైటిస్ 'ఎ' కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న దృష్ట్యా వాటి నివారణకు సంబంధిత వ్యాక్సిన్ చేయించుకోవడం చాలా అవసరమని ప్రముఖ పిడియాట్రిక్, వాక్సినిస్ట్ డాక్టర్ సిహెచ్. ఫణికృష్ణ తెలిపారు. ఇటీవల ఒక ఆసుపత్రి నుంచి సేకరించిన డేటా ప్రకారం ప్రతి రోజూ 10 నుంచి 15 మంది రోగులు హెపటైటిస్'ఎ'తో వస్తున్నట్టు స్పష్టమైంద న్నారు. దీనిపై ప్రభుత్వం తగిన అవగాహన కల్పించాలని తెలిపారు. హెపటైటిస్ ఎ అత్యంత ప్రమాదకరమైన కాలేయ సంక్రమణ వ్యాధి అని, ప్రధానంగా కలుషితమైన ఆహారం, నీటి వినియోగం ద్వారా వ్యాపిస్తుందన్నారు. ప్రత్యేకంగా హాస్టల్లో నివాసం ఉండేవారు, తరచూ బయట భోజనాలు చేసేవారు ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉందన్నారు. సాధారణంగా హెపటైటిస్ ఎ 14 నుంచి 28 రోజుల తరువాత బయట పడుతుందన్నారు. కామెర్లు, జ్వరం, అనారోగ్యం, ఆకలి లేకపోవటం, అతిసారం, వికారం, వాంతులు, కడుపులో అసౌకర్యం వంటి లక్షణాలు ఉంటాయన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ఆర్‌జెడి విజయభాస్కర్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న విజయభాస్కర్

ప్రజాశక్తి -గాజువాక : కేవలం మార్కులే కాకుండా విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్పేలా ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేకశ్రద్ధ చూపాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్ సూచించారు. శనివారం పాతగాజువాక చైతన్యనగర్‌లో గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల కరెస్పాండెంట్స్‌కు పాఠశాల నిర్వహణపై శిక్షణనిచ్చాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ, విద్యార్థులు చెడు వ్యసనాల జోలికి పోకుండా వారిపై ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. దీనికోసం పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు యాజమాన్యాలు తెలుసుకోవాలన్నారు. ఎంఇఒలు సునీత, విశ్వనాథం మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల నమోదు, హాజరు, ఇతర రికార్డుల నిర్వహణపై సూచనలు చేశారు.అనంతరం జిప్సా అధ్యక్షులు పాలవలస. భాస్కరరావు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల నిర్వహణపై విద్యాశాఖ అధికారుల ఇలాంటి అవగాహన కార్యక్రమం నిర్వహించడం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జిప్సా కార్యదర్శి బి శ్రీనివాస్, కోశాధికారి డి శ్రీనివాసరావు, సలహాదారులు జగ్గారావు, జగన్ సభ్యులు మురళీ, మౌళి, నివాస్, రవికుమార్, పరశురామ్ 100 మంది వివిధ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు..

క్రీడాకారునికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి, తదితరులు

ప్రజాశక్తి-పద్మనాభం :నేపాల్‌లో జరగనున్న ఆసియా షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన మండలంలోని రేవిడి గ్రామానికి చెందిన షూటింగ్‌బాల్ క్రీడాకారుడు రెల్లి సురేష్‌కు శ్రీశ్రీనివాస యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వేంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు వేంపాడ శ్రీనివాసరెడ్డి అతని బాల్య స్నేహితులు బాసటగా నిలిచారు. నేపాల్‌లో ఆసియా పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సురేష్‌కు అక్కడికి వెళ్లేందుకు రూ.పదివేల ఆర్థికసాయం అందించారు. కాగా తనను ప్రోత్సహించిన వేంపాడ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, అతని మిత్రులకు సురేష్ ధన్యవాదాలు తెలిపాడు. కార్యక్రమంలో బైపల్లి ఉమామహేశ్వరరావు, తుపాకుల కనకరాజు, శంకర్ శ్రీనివాస సేవా సంఘం ప్రతినిధులు, సురేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

130 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -అనందపురం: మండలంలోని వెల్లంకి గ్రామంలో సుబ్బిరామిరెడ్డి, కల్యాణమండపంలో వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలోచ విశాఖపట్నం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 130మందికి కంటిపరీక్షలు నిర్వహించి, 25 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు.వారిని సోమవారం విశాఖలోని శంకర్‌ఫౌండేషన్ ఆసుపత్రికి తీసుకెళ్లనున్నారు. కంటి నరాలు చికిత్సకు ఇద్దరిని, కంటి పైపొర చికితకు ఒకరిని, కంటి నీటి కాసుల చికిత్సకు ఇద్దరిని, కంటి రెప్పల చికిత్సకు ఒకరిని, చిన్నపిల్లల కంటి చికిత్సకు ఒకరిని గుర్తించి, స్పెషలిస్ట్‌వైద్యసేవలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఆర్ఎంపి వైద్యులు కనకరావు, వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాకర సురేష్ కుమార్, ఒఎస్‌జి శివ, సభ్యులు సాడి శంకర్, కొర్రాయి తేజ, ప్రతాప్, మెహర్, కిరణ్, నాయుడు, శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ గీతాంజలి, గంగాధర్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆడినేటర్ వై.రాజు ప్రసాద్ ,నర్సింగ్ స్టాఫ్ శిరీష పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రధాన రహదారి


- పలు ప్రాంతాల్లో పెద్ద పెద్ద గోతులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-పరవాడ

గాజువాక -ఎలమంచిలి ప్రధాన రహదారి పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదభరితంగా ఉంది. ప్రధానంగా పరవాడ సినిమా హాలు జంక్షన్ దాటి శ్రీధరల ట్రేడర్స్ ఎదురుగా భారీ గుంతలు ఏర్పడ్డాయి. రహదారికి ఇరువైపులా కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు, చుట్టూ పక్కల నుండి వచ్చే మురికి నీరు రోడ్డు పైకి ప్రవహించడం, ఈ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో పలుచోట్ల రోడ్డుపై పెద్ద పెద్ద లోతైన గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ గుంతల మీదుగా రాకపోకలు సాగించే సమయంలో వాహనదారులు పలుమార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షపు నీరు ఈ గోతుల్లో చేరితే మరింత ప్రమాదకరంగా ఉంటున్నాయి. ఈ గుంతల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల వాహనం దారులకు గుంతల వద్దకు వచ్చేవరకు అవి కనపడకపోవడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి మీదుగా విశాఖపట్నం నుండి అచ్యుతాపురంలోని వివిధ కంపెనీలకు వెళ్లే బస్సులు, రాంబిల్లి, ఎలమంచిలికి వెళ్లే బస్సులు, బొగ్గు లారీలు, భారీ వాహనాలు ప్రతి రోజు వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ గోతుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి గుంతలు పూడ్చేందుకు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



పరవాడ సినిమా హాల్ జంక్షన్ సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న పెద్ద పెద్ద గోతులు



మంత్రి లోకేష్‌ను కలిసిన టిడిపి నాయకులు మళ్ల సురేంద్ర

నామినేటెడ్ పదవులపై లోకేష్ హామీ

ప్రజాశక్తి-అనకాపల్లి

టిడిపి కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలుగుదేశం పార్టీ బీసీ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర తెలిపారు. ఈ మేరకు సురేంద్ర శనివారం అమరావతిలో నారా లోకేష్‌ని కలిసి అనకాపల్లి నియోజకవర్గంలో ప్రస్తుత పార్టీ పరిస్థితులపై చర్చించినట్లు పేర్కొన్నారు. తనతో పాటు అనకాపల్లి నియోజకవర్గంలో మొదటినుంచి పార్టీ కోసం కష్టపడుతున్న సీనియర్ నాయకులను, కూటమికి ముందు వచ్చినవారిని పూర్తి స్థాయిలో పార్టీకి చేసిన కృషిని బట్టి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరినట్లు వెల్లడించారు. దీనికి నారా లోకేష్ స్పందిస్తూ కచ్చితంగా ప్రతి నియోజకవర్గంలో పార్టీకి కష్టపడిన అందరి వివరాలు సేకరిస్తున్నామని, తొందరలోనే నామినేటెడ్ పదవులతో గౌరవిస్తామని చెప్పినట్లు సురేంద్ర తెలిపారు.

తుమ్మపాలలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల పర్యటన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాల గ్రామంలో శనివారం ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ ఎ.నాగేశ్వరరావు, ఏఈ శ్రీనివాసరావు పర్యటించారు. గ్రామంలో మురుగునీటి కాలువలను, కొత్తగా నిర్మించే సీసీ డ్రైన్లను పరిశీలించారు. ప్రమీలనగర్లో ఉన్న ఎల్లయ్య కాలవ సిసి వర్కు చేయించుటకు ఎంపీపీ నిధులు నుండి సుమారుగా రూ.18 లక్షలతో ఎస్టిమేట్ వేశామని సర్పంచ్ పెంటయ్య నాయుడు తెలిపారు. గ్రామసభలో రికార్డు చేశామని, ఎస్టిమేట్లు వేయించిన తర్వాత ఈ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుతం నిధులు కొరత ఉందని, నిధులు విడుదలైన వెంటనే ఈ పనులు ప్రారంభిస్తామని సర్పంచ్ తెలిపారు. శారదానది నీరు మన తుమ్మపాల ప్రజలకు అందించేలా శారద నదిలో ఉన్న నూతి ద్వారా పైప్ లైన్ వేయించి మంచినీటి సరఫరాను చేసేందుకు చర్యలు చేపట్టాలని డిఈని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి బాబి, ఎంపీటీసీ చదరము నాగేశ్వరరావు, వార్డ్ మెంబర్ తర్రా సత్యారావు, బిఎస్ఎన్ఎల్ జిల్లా మాజీ అడ్వైజర్ కమిటీ మెంబర్ పీలా విశ్వేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు కోన దుర్గ, కోన అప్పారావు పాల్గొన్నారు.

పాఠశాలలో చెట్టు నరికివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం పాఠశాలలో చెట్టు నరికివేతపై ఆ పాఠశాల హెచ్ఎం నాగమణి పోలీసులకు, ఎంఇఒకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం పై గ్రామంలో ప్రజాప్రతినిధులు చర్చలు జరిపినట్లు తెలిసింది.

ఐదేళ్ల విద్యార్థికి ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

ప్రజాశక్తి-చోడవరం

చోడవరానికి చెందిన అలవల ఆస్మాన్‌రామ్ అనే ఐదేళ్ల విద్యార్థి ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించాడు. గత మే నెలలో సంస్థ ఆన్లైన్లో నిర్వహించిన పోటీల్లో లింగాష్టకం 57 సెకండ్లు పూర్తి చేసి ఈ అరుదైన రికార్డును సాధించాడు. గతంలో వేరొకరికి ఒక నిమిషం 15 సెకండ్లు రికార్డ్ ఉంది. దానిని ఆస్మాన్‌రామ్ బ్రేక్ చేశాడు. రెండు సంవత్సరాల ఆరు నెలల వయసులో 118 దేశాల జెండాలను గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు ఆస్మాన్ రామ్ సాధించాడు. ఆస్మాన్ రామ్ చోడవరంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో చదువుతున్నాడు. విద్యార్థి తల్లిదండ్రులు సత్యప్రసాద్, మానస ఇరువురు చార్టెడ్ అకౌంట్స్‌గా పనిచేస్తున్నారు. బాలుడు రికార్డు సాధించిన పట్ల పట్టణానికి చెందిన పూసర్ల రామారావు, పలువురు ప్రముఖులు అభినందించారు.



రికార్డు సాధించిన ఆస్మాన్‌రామ్

డైట్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రముఖ విద్యావేత్తలు, గ్రాడ్యుయేట్లు, సాధకులు, బహుముఖ వ్యక్తుల సమక్షంలో శనివారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఎన్టీయూ గురజాడ ఇన్చార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ నైపుణ్యం పెంచుకోవాలనే దృక్పథం ఉన్నవారిదే భవిష్యత్తని పేర్కొన్నారు. గౌరవ అతిథి ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఛైర్మన్ సి.హెచ్. శ్రీనాథ్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాల కోసం వెతకడం కాకుండా తమ ఆలోచనలకు రూపమిచ్చి, వ్యవస్థాపకతలోకి అడుగుపెట్టడం ద్వారా అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. డైట్ ఛైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఇన్స్టిట్యూట్ల సపోర్ట్‌కి సంబంధించిన రెగ్యులర్ అప్‌డేట్ల కోసం వారు daa.edu.inకి లాగిన్ చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు ప్రశంస అవార్డులు, 460 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైకుంఠరావు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ శాసనసభకు వచ్చి వాస్తవాలు ప్రకటించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అసెంబ్లీకి రాకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శ్వేత పత్రాలపై ఎక్కడో మాట్లాడితే ఏమి ఉపయోగమని, శాసనసభకు వచ్చి వాస్తవాలు ప్రకటించాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి రామ్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్‌లో డివిఆర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులకు సమావేశంలో మాట్లాడారు. ప్రజలను ఇబ్బందులు పెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. తప్పు చేసేవాళ్ళు భయపడాలి గాని జగన్ అండ్ కో ఎందుకు భయపడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. పుచ్చకాయల దొంగ అంటే భుజాలు తడుముకున్న విధంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ తీరు ఉందని విమర్శించారు. దేశ రాజధానిలో రాష్ట్రం పరువు తీయడం తప్ప వైయస్ జగన్ చేసింది ఏమీ లేదన్నారు. వికలాంగుల పింఛన్ల పేరుతో వైసిపి ప్రభుత్వంలో అనేక అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ చేయాలని కోరారు. సమావేశంలో డాక్టర్ పప్పూర్ నికుంజ్, జి.సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ముకుందరావు

వరి నారుమడులను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అధిక వర్షాల బారి నుంచి వరి నారుమళ్ళను సంరక్షించుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ ముకుందరావు అన్నారు. పరిశోధన స్థానంలో శనివారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతులతో శిక్షణ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ జూన్, జూలై నెలలో సాధారణ వర్షపాతం 272 మిల్లి మీటర్లకు గాను 412 మిల్లీమీటర్లు నమోదైనట్లు చెప్పారు. వరి నారుమళ్ళ మునిగిన నేపథ్యంలో వర్షపు నీటిని తొలగించి ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ ఎరువులను వేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ కార్యాలయ ప్రతినిధి శ్రీధర్ రావు మాట్లాడుతూ నీట మునిగిన వరి నారు వారం రోజులు దాటితే చనిపోయే అవకాశం ఉన్నందున తిరిగి నారుమడి వేసుకునే రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ పివికె జగన్నాథరావు, డాక్టర్ ఆదిలక్ష్మి, డాక్టర్ రమణ మూర్తి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఎం విశాలాక్షి, వివిధ వ్యవసాయ డివిజన్లకు చెందిన ఏడీఏలు, కెవికె శాస్త్రవేత్తలు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం భూ యజమానికి నష్టం వాటిల్లకుండానే కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు మంజూరు చేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారి బి.మోహన్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ నుంచి అందిస్తున్న విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం పొందాలంటే తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రాలు పొంది ఉండాలన్నారు. పంట సాగు హక్కు పత్రం కాలపరిమితి 11 నెలలని, చిన్న, సన్న కారు రైతులు దేవాదాయ భూములు చేసుకున్న రైతులు అర్హులని, గ్రామ సచివాలయాల్లో గ్రామ పరిపాలన అధికారి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పత్రంపై భూ యజమాని, సాగుదారు ప్రతినిధి, వీఆర్వో సంతకాలు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న మూడు రోజుల్లో హక్కుపత్రం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. 2024- 25 సంవత్సరంలో జిల్లాలో 5,560 మందికి పంట సాగు హక్కు పత్రం ఇవ్వడానికి లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటికే 1400 మందికి హక్కు పత్రాలు మంజూరు చేశామని తెలిపారు.

పింఛన్ల పంపిణీపై కార్యదర్శులతో సమీక్ష

ప్రజాశక్తి-సబ్బవరం : ఆగస్టు నెల పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులతో స్థానిక ఎంపీడీవో ఎస్ రామ్మోహన్‌రావు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు నెల ఒకటో తారీఖున పింఛనుదారులందరికీ 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. వివిధ కారణాలతో అందుబాటులో లేని పింఛన్దారులకు రెండో తారీఖున పింఛను అందజేసి శత శాతం పూర్తి చేయాలని కోరారు. మండలంలోని 8219 మంది పింఛనుదారులు ఉండగా 3,43,65,500 రూపాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ ఓ.మహేష్, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపిడిఒ, కార్యదర్శులు



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేత గనిశెట్టి, ఉపాధి కూలీలు

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-మునగపాక : జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు 9 వారాలుగా బకాయి ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని వెంకటాపురం సచివాలయ కార్యదర్శి మోహినికి శనివారం సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ పనులు లేక ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు 9 వారాలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు కె.పూర్ణ, సిహెచ్.కుమారి, పి.దుర్గా, కె.ధరిణి, పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ కింద పగిలిపోయిన తాగునీటి పైపులు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని సంపతపురం నుండి కశింకోటకు తాగునీరు అందించే పైపులు రైల్వే ట్రాక్ కింద పగిలి పోయాయి. దీంతో కశింకోట గ్రామానికి మంచి నీరు సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయి. సంబంధత అధికారులు వెంటనే పైపులైన్‌కు మరమ్మతులు చేసి తాగునీరు అందించాలని కశింకోట ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యంపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో పారిశుధ్యం పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక ఈఓపిఆర్‌డి మహేష్ కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. వీధి కాలువలు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంచకూడన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు తమరాన బంగారు నాయుడు, అంగటి నాని, సెక్రటరీ సంతోషి, ఎఎన్‌ఎం, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన సబ్బవరపు ఈశ్వరరావు మాస్టారు, లక్ష్మి దంపతులు రూ.21,116 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలు శనివారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఈశ్వరరావు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావు, గెడ్డం కృష్ణ, దంగెటి నాని, దంగేటి ప్రకాష్, చింతల శ్రీను, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం కేపీ అగ్రహారం గ్రామంలో మన గ్రామం మన బాధ్యత అనే కార్యక్రమంలో శనివారం రోడ్డుకు ఇరువైపుల పేరుకుపోయిన తుప్పలను తొలగించారు. మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు యాదవ్ పిలుపు మేరకు సచివాలయ సిబ్బంది, యువత శ్రమదానం చేసి జంగిల్ క్లియరెన్స్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఆర్.రాము, స్థానిక పెద్దలు దేవర తాతబాబు (గురువు), విఆర్పి కె.రమేష్, దేవర భూలి నాయుడు, అద్దిపిల్లి గోవింద, పి.మాణిక్యం, సచివాలయ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.



తుప్పలు తొలగిస్తున్న కెపి.అగ్రహారం గ్రామస్తులు

ఘనంగా అబ్దుల్ కలాం వర్థంతి



కె.కోటపాడు అయ్యన్న కాలేజీలో కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- కె.కోటపాడు

మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె.అబ్దుల్ కలామ్ 9వ వర్థంతి సందర్భంగా స్థానిక అయ్యన్న విద్యా సంస్థల ప్రాంగణంలో శనివారం కలాం విగ్రహానికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ, ఉపాధ్యక్షుడు కోరుపోలు శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో అబ్దుల్ కలాం వర్థంతి సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు, సూపరింటెండెంట్ అనురాధ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర చర్చా వేదిక యువజన కార్యాలయంలో కలాంకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేదిక నాయకులు బుద్ధ రాజేష్, మల్ల రామ్ బుజ్జి, టిడిపి, జనసేన నాయకులు పచ్చికూర రాము, దాడి బుజ్జి, కాంగ్రేగుల ఉమా, లంకెలపల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్థంతిని స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ అధ్వర్యంలో నిర్వహించారు.టిడిపి యువ నేత, గంటా రవి తేజ పాల్గొని కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ సూర్య ప్రసాద్, స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ బసవకృష్ణ మూర్తి, పలువురు అధ్యాపకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు

వేపగుంట : జివిఎంసి 52వ వార్డు సంజీవయ్యనగర్‌లో అబ్దుల్ కలాం విగ్రహానికి నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్.కాలనీ వాసులతో కలసి పూలమాలలు వేసినివాళులర్పించారు.



దేవరాపల్లిలో...

దమ్ముమడిలో ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి





దమ్ముమడిలో బోల్తా పడిన ట్రాక్టర్ పైకి లేపుతున్న స్థానికులు, బండారు శివ మృతదేహం

ప్రజాశక్తి- కె.కోటపాడు : వరి నాట్లు వేసేందుకు దమ్ము దుక్కి దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని కింతాడ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... కింతాడ గ్రామానికి చెందిన బండారు శివ (35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం దమ్ము దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. దమ్ము మడిలో బోల్తా పడిన ట్రాక్టర్ శివపై పడడంతో శివ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతిని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కే.కోటపాడు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు శివకు భార్య చంద్రకళ, ఇద్దరు మైనర్ పిల్లలు ఉన్నారు. యువకుడైన శివ మృతి చెందడంతో కింతాడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎఎంఎఎల్ కళాశాలకు నాక్ బి డబుల్ ప్లస్

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ బి డబుల్ ప్లస్ ను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియ సాగిన రెండు నెలలపాటు ప్రత్యక్షంగా పరోక్షంగా రాత్రింబవళ్లు శ్రమించిన అనకాపల్లి వర్తక సంఘ బాధ్యులు, ఏఎంఏఎల్ కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలియజేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో బి డబుల్ ప్లస్ రావడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎయిడెడ్ విద్యావ్యవస్థకు తీరని ఇబ్బందులు ఎదురయ్యాయి. స్కాలర్‌షిప్స్ విధానంతో ఎదురైన సమస్యలతో రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థలలో విద్యార్థుల నమోదులు గణనీయంగా తగ్గాయి. వీటితో పాటు ప్రైవేటు విద్యాసంస్థల పోటీని కూడా తట్టుకొని ఏఎంఏఎల్ కళాశాల మొక్కవోని పట్టుదలతో ధీటుగా నిలిచింది. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రాకపోయినప్పటికీ, ప్రభుత్వం నిబంధనల మేరకే విద్యార్థుల నుండి ఫీజులు తీసుకుంటూ, అనకాపల్లి వర్తక సంఘం ఆర్థిక సహాయంతో విజయవంతంగా నడుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో బి డబుల్ ప్లస్ రావడం చాలా గొప్ప విషయం. ఇందులో పూర్వ విద్యార్థుల పాత్ర, పూర్వ విద్యార్థులైన దాతల సహకారం కూడా ఇందుకు అనుకూలించింది. ఇదే స్ఫూర్తిని కొనసాగించి వచ్చే పర్యాయంలో కళాశాలకు ఏ గ్రేడ్‌ను తీసుకురావడానికి కషి చేద్దామని, పూర్వ విద్యార్థుల సంఘం త్వరలో నిర్వహించబోయే అన్ని కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు పాల్గొంటారని ఆశిస్తున్నామని సంఘం అధ్యక్షులు బొడ్డేడ, కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు, కోశాధికారి వై జగదీశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

గొన్న కళాశాలకు నాక్ ఎ గ్రేడ్

ప్రజాశక్తి - పరవాడ : జివిఎంసి 79వ వార్డు పరిధి ఉన్న గొన్న కళాశాల నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) వారిచే నిర్వహించిన ఇన్‌స్పెక్షన్‌లో'ఎ' గ్రేడ్ సాధించింది. ఈ సందర్భంగా కళాశాల చైర్‌పర్సన్ గొన్న పూజిత హనీష మాట్లాడుతూ కళాశాలకు నాస్ ఏ గ్రేడ్ రావడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. గొన్న హేమచంద్‌నాయుడు మాట్లాడుతూ కళాశాల విద్య నాణ్యతను మరింత మెరుగుపరిచే దిశగా అడుగు వేస్తుందని తెలిపారు.

పిఎసిఎస్ సభ్యులు వ్యక్తిగత వివరాలు సమర్పించాలి

ప్రజాశక్తి -మునగపాక : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కంప్యూటీకరణ జరుగుతున్న నేపథ్యంలో సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వారి వ్యక్తిగత వివరాలు సమర్పించాలని స్థానిక సహకార సంఘం కార్యనిర్వహణ అధికారి ఏవి గోపాలరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. సభ్యులు ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నెంబర్‌తో సహా సహకార సంఘానికి సమర్పించి తమ సభ్యత్వాలను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని ఆయన కోరారు.

పిఎం రాష్ట్రీయ బాల పురస్కారానికి దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం -2025 కోసం దరఖాస్తుల గడువు ఈ ఏడాది ఆగస్టు 31 వరకు పొడిగించినట్టు ఏపీ ఎస్సీ పిసిఆర్ సభ్యులు గుండు సీతారాం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న ఐదేళ్ల పైబడి, 18 సంవత్సరాలకు మించని (ఈ సంవత్సరం జులై 31 నాటికి) వయస్సు గల భారతదేశంలో నివసిస్తున్న ఏ చిన్నారి అయినా ఈ అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మొదలైన వాటిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనపరుస్తున్న భారత దేశ సంతతికి చెందిన బాలలు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వెబ్సైట్ https://awards.gov.in నందు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రంలో గతంలో ప్రభుత్వం ఫైర్ స్టేషన్‌కు కేటాయించిన భూమి కబ్జాకు గురైందని, ఆ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. సబ్బవరం కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం ఎదురుగా సబ్బవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 286లో సుమారు 40 సెంట్లు భూమిని ప్రభుత్వం సబ్బవరం ఫైర్ స్టేషన్‌కు గతంలో కేటాయించింది. అయితే ఆ భూమిని కొంతమంది కబ్జాదారులు ఆక్రమణ చేసి ఆ భూమిలో షెడ్లు నిర్మించారు. ఈ భూమిని వెంటనే ప్రభుత్వం తిరిగి తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల విలువ విపరీతంగా పెరగడంతో ఈ భూమిని కొంతమంది కబ్జాదారులు కబ్జా చేశారు. ఈ విషయమై తక్షణమే రెవెన్యూ అధికారులు ఈ భూమిని సర్వే చేసి హద్దులను గుర్తించి తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలని స్థానికులు కోరుతున్నారు.

పాలిటెక్నిక్‌లో మిగిలిన సీట్లుకు 31న స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2024- 25 విద్యా సంవత్సరంలో డీసీఎంఈ, డిఈసిఈ బ్రాంచిలో మిగిలిన సీట్లకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. 2024లో పాలీసెట్ పరీక్ష రాసి సీటు రానివారు, సీటు వచ్చి కూడా ఏ కళాశాలలో రిపోర్టు చేయనివారు, 10వ తరగతి పాస్ అయి పాలిటెక్నిక్ చదవాలని అనుకుంటున్నవారు తమ దరఖాస్తులను ఈనెల 30న కళాశాలలో అందజేయాలని కోరారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యేవారు పదవ తరగతి మార్కుల లిస్టు, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ర్యాంకు కార్డు, కుల, ట్రాన్స్ఫర్, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాలిసెట్ హాల్ టికెట్ ఒరిజినల్‌తో హాజరు కావాలని, విద్యార్థి మెరిట్ ఆధారంగా సీటు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. సీటు పొందిన విద్యార్థులు ఫీజు మొత్తం 6000 తక్షణమే చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9441346598 నెంబర్ను సంప్రదించాలని కోరారు.

జోరుగా సాగు పనులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం నియోజక వర్గంలో గురువారం నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. దీంతో, అన్నదాతలు పొలం బాట పట్టారు. ఇప్పటికే వ్యవసాయ పనుల్లో నిమగ్నమై దమ్ములు సిద్ధం చేస్తున్నారు. సాగు చేసుకునేందుకు విత్తనాల కొనుగోలు, పొలాలను సిద్ధం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. నిన్నా మొన్నటి వరకు భానుడి భగభగకు ఇబ్బంది పడిన రైతులు వరుణుడు కరుణించడంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చాయి. వ్యవసాయ పొలాల్లో పంటలు వేసుకోవడానికి అనుకూల వాతావరణం ఏర్పడింది.

నియోజకవర్గంలో 2500 హెక్టార్లలో వరి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. మండలాల్లో ఆర్బీకేలలో ఎరువులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వసాయశాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులను పొందాలని రైతులకు సూచించారు. కురిసిన వర్షాలకు చెట్టుపల్లి లో ఎకరన్నర వరి నారు పాడైనట్లు గుర్తించామని వ్యవసాయ శాఖ అధికారి అప్పారావు తెలిపారు.



గొలుగొండలో సిద్ధంగా ఉన్న పొలాలు



ఏపుగా ఎదిగిన వరి నారు

గొలుగొండ: మండలంలో రైతులంతా వరి ఉడుపులకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో వరి నారు సరియైన సమయానికి రైతులుకు అందివస్తుంది. దీంతో రైతులంతా ఉడుపుల కోసం పొలాలను దమ్ములు పట్టి సిద్ధం చేస్తున్నారు. మండలంలో సుమారు 3400 ఎకరాలు వరి సాగుకు రైతులు సిద్ధం చేశారు. మండలంలో నాగపురం, కృష్ణదేవిపేట, గాదంపాలెం, విప్పలపాలెం, కొత్త మల్లంపేట, అమ్మపేట, గొలుగొండ, జోగంపేట, పాత మల్లంపేట, చీడిగుమ్మల, గుండుపాల కొత్తూరు, పాకలపాడు, పుత్తడిగైరంపేట, రావణాపల్లి, ఏటిగైరంపేట పంచాయతీలలో రైతులంతా వరి ఉడుపుల కోసం దమ్ముల పనుల్లో బిజీగా ఉన్నారు. రావణాపల్లి రిజర్వాయర్ ఆయకట్టు కింద మండలంలో సుమారు 500 ఎకరాలు, విప్పలపాలెం ఆయకట్టు క్రింద సుమారు 1200 ఎకరాల సాగుకు సన్నద్ధం చేస్తున్నారు.మిగిలిన భూములకు సాగునీటి బోర్లు , వర్షాలపై ఆధారపడి రైతులు సాగు చేస్తుంటారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడం, వరి నారులు ఆరోగ్యకరంగా ఎదిగి అందుబాటులోకి రావడంతో రైతులంతా వరి పొలాల పనుల్లో పూర్తిగా నిమగ్నమై ఉన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

-శిక్షా సప్తాహ్‌లో భాగంగా పలు చోట్ల మొక్కలు నాటివేత

శిక్షా సప్తాహ్ ఆరో రోజు కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో 'అమ్మతో మొక్క నాటిద్దాం' అన్న నినాదంతో పాఠశాల విద్యార్థుల తల్లులతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

బుచ్చెయ్యపేట:పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని బుచ్చెయ్యపేట ఎంఇఒ-2 బి.కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని కందిపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లులతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.వి.మూర్తి, ఉపాధ్యాయులు లావణ్య, ప్రశాంత్, రమణ, శ్రీరామ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ప్రతి విద్యార్థి అమ్మ పేరున మొక్క నాటి దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కె.కోటపాడు ఎస్సై లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో శిక్ష సప్తాహ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఇఒలు కె.సత్యనారాయణ, డివిడి ప్రసాద్, పాఠశాల హెచ్ఎం ఎస్.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లి:మొక్కలు పెంపకంతో పర్యావరణం పరిరక్షించబడుతుందని ఎంఈఓ కే.నరేష్ తెలిపారు. మండలంలో పలు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం సత్యనారాయణ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో బాదం, జామ తదితర నీడనిచ్చే మొక్కలతో పాటు పూల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి. ఎస్.ఆచార్యులు, ఫల్గుణరావు, కుమారి, చిన్నారావు, రమేష్‌బాబు, శ్రీదేవి పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

సబ్బవరం : మండలంలోని అరిపాక జెడ్‌పి హైస్కూల్, ఎంపిపి పాఠశాలల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బిఎస్ఎన్ మూర్తి, హైస్కూల్ హెచ్ఎం మల్లేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల టీచర్ వనం భాస్కరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని పలు పాఠశాలల్లో ప్రతి విద్యార్థి తన తల్లి పేరిట మొక్కను నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ సంబంధిత పాటలు, పద్యాలు, నాటకాలు విద్యార్థులు ప్రదర్శించారు. కేజీబీవీ, కాశీపురం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ ఉషారాణి పాల్గొన్నారు. ఉద్దండపురం హైస్కూలులో హెచ్ఎం సత్యారావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సర్పంచ్ పోడగట్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ్ వారోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఇందులో భాగంగా పందూరు పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ రామారావు, జోష్ విద్యార్థులను అభినందించారు, విద్యార్థులు ఆకులతో చేసిన బొమ్మల ఆకృతులు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలని జివిఎంసి జోనల్ కమిషనర్ కె.కనక మహా లక్ష్మి విద్యార్థులకు సూచించారు. శనివారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా రెండోవార్డు రాయిపాలెం, జివిఎంసి ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. హెచ్ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులతో ఎకో క్లబ్ ను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జెడ్‌పికి పూల మొక్క బహుమతిగా అందజేశారు.



జెడ్‌పికి పూలమొక్క అందజేస్తున్న హెచ్ఎం

తగరపువలస: భీమిలి మండలం, సింగనబంద పంచాయితీ, కృష్ణంరాజుపేటఎంపియుపి పాఠశాలలో శనివారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా "సేవ్ ట్రీ స్, సేవ్ ఎర్త్"పై అవగాహన కల్పించారు.పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. సర్పంచ్ జివి నారాయణ, హెచ్ఎం, ఉపాధ్యాయులు జి సత్య నారాయణ పాల్గొన్నారు.

ఆరిలోవ : శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థుల తల్లులను పిలిచి మొక్కలు నాటించి, వాటి పోషణ, సంరక్షణ విద్యార్థులకు అప్పగించారు.కార్యక్రమంలో చినగదిలి ఎంఇఒ అనురాధ, జిల్లా మధ్యాహ్న భోజన పథకం కో ఆర్డినేటర్ శాస్త్రి, సత్యనారాయణ, హెచ్ఎం జికెడి భవాని, ఉపాధ్యాయులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో శనివారం ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నర్సీపట్నం డివిజన్ కమిటీ అధ్యక్షులుగా వై.జగన్నాధరావు, ప్రదాన కార్యదర్శి రాయుడుతో పాటు ఉపాధ్యక్షులుగా జ్ఞానేశ్, కిరణ్, సాయి, దుర్గ, వికాస్, సహాయ కార్యదర్శులుగా మను, భూషణ్, శివ, మోహన్, దుర్గా ఎన్నికయ్యారు. డివిజన్ సభ్యులుగా చంటి, జై.కృష్ణ, ప్రసాద్, గణేష్, రాము, వరహాలు, రవి, స్వామి, శేఖర్, శ్రీను, లవరాజు, మహేంద్ర, డేవిడ్ ఎన్నికయ్యారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెసిడెంట్ జి.గీతాకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. r సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తుందని చెప్పారు. విద్యార్థుల్లో శాస్త్రీయ, సామాజిక చైతన్యాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పైల రాజు తదితర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం చిన్నయ్యపాలెం గ్రామంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, డెంగ్యూ వ్యాధి పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింగంపల్లి రాజేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాలు ఇస్తున్న ప్రిన్సిపల్, నాయకులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, మండల టిడిపి నాయకులు జానకి శ్రీనులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయాలన్నారు. విద్యార్థులకు సౌకర్యాలు పట్ల దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు సూర్యారావు, టౌన్ పార్టీ అధ్యక్షులు ఏసుబాబు, టిడిపి నాయకులు శివ పాల్గొన్నారు.

కత్తి పద్మారావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కొత్తకోట:ప్రముఖ కవి, రచయిత, దళితోద్యమ నాయకుడు కత్తి పద్మారావు జన్మదిన వేడుకలు రావికమతం మండలం కొత్తకోట అంబేద్కర్ కాలనీలో బి.ఆర్ అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు మల్లేటి రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో దళిత, గిరిజన, బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ పద్మారావు పలు ఉద్యమాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమం లో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పోర్టు ఆసుపత్రిని పిపిపికి ఇవ్వొద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ పోర్టు హాస్పిటల్‌ను రూ.222.43 కోట్లతో పిపిపి పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలనే కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రతిపాదనను విరమించుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ, విడిఎల్‌బి అండ్ డాగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విశాఖపట్నం పోర్టు ఆస్పత్రిని రూ.222.43 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖా మంత్రి లోక్ సభలో శుక్రవారం ప్రకటించారన్నారు. కైలాసపురంలో ప్రస్తుతం 80 పడకలతో నడుస్తున్న పోర్టు గోల్డెన్ జూబిలీ ఆస్పత్రిని పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంతో 300 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చనున్నట్లు, పోర్టు ఉద్యోగుల వైద్యం ఖర్చును తగ్గించడానికి ఈ ప్రతిపాదన చేసినట్లు ఆయన చెప్పారని, ఇది పచ్చి అబద్ధం, మోసపూరితమైనది అని ఆరోపించారు. ఇదే జరిగితే పోర్టులో సుమారు 4 వేలమంది ఉద్యోగులు, అధికారులు, కార్మికులు, 13 వేల మంది పెన్షనర్లను పూర్తిగా వైద్యం దూరం చేయడమే అవుతుందన్నారు. ఇప్పటికే పిపిపి మోడల్‌లో నడిచిన గంగవరం పోర్టు, వైజాగ్ పోర్టుల్లో బెర్త్ లు ఇచ్చారన్నారు. గతంలో కాగ్ నివేదిక ప్రకారం పోర్టుల్లో పిపిపి, బిఓటి విఫలం అయిందని, పోర్టుకి నష్టం వాటిల్లిందని చెప్పిందన్నారు.విశాఖపట్నం పోర్టు కు 2022-23 సంవత్సరంలో రూ. 380 కోట్లు, 2021-22సంవత్సరంలో రూ. 276 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. మంచి ఆరోగ్యం-రక్షణ కలగజేసేందుకు అత్యంత ఆధునిక పరికరాలను సమకూర్చాలన్నారు. అవసరం మేరకు స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలని, అవసరమైన సిబ్బందిని నియమించి,పోర్ట్ యాజమాన్యమే పోర్టు సొంత నిధులతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. పోర్టు ఆసుపత్రిని పిపిపికి ఇవ్వడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమన్నారు. భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి పోర్ట్ హాస్పటల్ ను కాపాడుకుంటామని తెలిపారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-రోలుగుంట: వాతావరణంలో మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా రోలుగుంట మండలం బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజన గ్రామాలైన అర్ల, గంగవరం గ్రామాల్లో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్యాధికారి శ్రీనివాసరాజు ఆద్వర్యంలో సుమారు 60మంది రోగులకు వైద్య సేవలు అందించారు. అనంతరం వైద్యాధికారి శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ, కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగాలన్నారు. మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు రాకుండా అందరూ దోమతెరలు తప్పనిసరిగా వాడాలని సూచించారు. కలుషితమైన ఆహారం తీసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవంతి కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

ప్రజాశక్తి - అనకాపల్లిడెస్క్ : జిల్లాలోని మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (UGC) 10 సంవత్సరాలకు స్వయం ప్రతిపత్తి హెూదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని కళాశాల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.గ్రామీణ ప్రాంతమైన అనకాపల్లి జిల్లా మాకవరపాలెం లో 1999లో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గ్రామీణ ప్రాంత వాసుల విద్యాభివృద్ధి పెంపొందించే ఉద్దేశంతో ఈ అవంతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలను స్థాపించారు. ఈ కళాశాల దినదినాభివృద్ధి చెందుతూ ఎంతోమంది గ్రామీణ విద్యార్థులకు విద్యావకాశాలు కల్పిస్తుంది. మంచి నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్య తో పాటు కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తూ గుర్తింపు పొందింది. 10 ఏళ్ల పాటు స్వయం ప్రతిపత్తి హోదా కల్పిస్తూ ప్రస్తుతం ఉత్తర్వులు జారీ చేయడం . మంచి శుభ పరిణామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మోహన్‌రావు తెలిపారు. యూజీసీ అటానమస్ గుర్తింపుతో తమ బాధ్యత మరింత పెరిగిందని, ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్య వ్యాప్తికి కృషి చేస్తామని తెలిపారు. కళాశాల వ్యవస్థాపకులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అవంతి విద్యా సంస్థల వైస్ చైర్మన్ నందీష్, సెక్రటరీ ప్రియాంక, సిఇఒ శ్రవణ్ అధ్యాపకులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.

'చెరువుల పరిరక్షణ' జిల్లా ప్రధాన కార్యదర్శిగా కల్యాణ్

ప్రజాశక్తి -కొత్తకోట: ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా రావికమతం మండలం చీమలపాడు గ్రామానికి చెందిన నల్లి కళ్యాణ్ ఎంపిక య్యారు. చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థపక అధ్యక్షులు మరిచర్ల కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర నాయకులు గవిరెడ్డి రఘు, సత్య చక్రవర్తి, రాష్ట్ర అధ్యక్షులు జాగరపు ఈశ్వర్ ప్రసాద్ సూచనల మేరకు జిల్లా అధ్యక్షులు దరిమిశెట్టి నారాయణ రావు నియామకం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణ్ మాట్లాడుతూ, జిల్లాలో చెరువుల అక్రమణ పై దృష్టి సారించి ఆయా వివరాలను రెవిన్యూ అధికారులకు తెలియజేస్తామన్నారు. ఆయుకట్టు రైతులకు సాగు నీరు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.



జిల్లా పరిషత్ స్థాయీ సభ్యులుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘం సభ్యులుగా ఉమ్మడి విశాఖ జిల్లాలో నూతనంగా ఎన్నిక కాబడిన శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులను జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘములకు ఎంపిక చేశారు. ఖాళీ అయిన వివిధ స్థాయి సంఘాలకు ఎంపికైన వారిలో ప్రణాళిక, ఆర్థిక స్థాయీ కమిటీకి కొణతాల రామష్ణ (అనకాపల్లి), సుందరపు విజయకుమార్ (యలమంచిలి), కె.ఎస్.ఎన్.ఎస్ రాజు (చోడవరం), బండారు సత్యనారాయణమూర్తి (మాడుగుల) చింతకాయల అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం), వంగలపూడి అనిత (పాయకరావుపేట), పంచకర్ల రమేష్ బాబు (పెందుర్తి), గంటా శ్రీనివాసరావు (భీమునిపట్నం), రేగం మత్స్యలింగం (అరకు), మత్స్యరాస విశ్వేశ్వర రాజు (పాడేరు) వీరితోపాటు పార్లమెంట్ సభ్యులు ఎం. భరత్(విశాఖపట్నం),సి.ఎం రమేష్ (అనకాపల్లి), డాక్టర్ గుమ్మ తనుజా రాణి(అరకు) నియమితులయ్యారు.

ఉత్తమ పోలీసులకు రివార్డులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి సరైన సత్కారం దక్కింది. శనివారం ఉదయం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో 81 మంది పోలీస్ సిబ్బందికి సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. పోలీసుల పనితీరును మెచ్చుకున్నారు.

ఘనంగా వైభవ్ 'విశేష' జ్యూయలరీ ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నానికి చెందిన ప్రముఖ బంగారు ఆభరణాల సంస్థ వైభవ్ జ్యూయలర్స్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు తలపెట్టిన విశేష జ్యూయలరీ ఎగ్జిబిషన్ శనివారం బీచ్ రోడ్‌లోని వెల్కమ్ హోటల్ డీవీ గ్రాండ్‌బేలో ఘనంగా ప్రారంభమైంది. 'విశేష' ప్రీవ్యూ అండ్ సేల్ జ్యూయలరీ ప్రదర్శన, అమ్మకం పేరిట ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను గంటా శారద, ఆశ, డాక్టర్ సరోజిని, సురేఖ, సావిత్రిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఇన్స్పైర్డ్, హ్యాండ్ క్రాఫ్ట్, క్యూరేటెడ్ గోల్డ్, డైమండ్, ఎంటిక్, ఫ్యూజన్, ఫైన్ జ్యూయలరీ డిజైనులతో పాటు కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా సరికొత్త కలెక్షన్ మహేయ (కోరల్) పగడాలతో పొదిగిన డిజైనర్ డైమండ్ జ్యూయలరీని ఇక్కడ అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శనలో సముద్రంలోని వృక్షజలాన్ని అనుకరిస్తూ సహజ ఆకృతుల నుండి ప్రేరణతో తయారు చేయబడిన ప్రత్యేక పగడాల (కోరల్) కలెక్షన్స్ కస్టమర్లను ఎంతగానో ఆకర్షించాయి. ఈ ప్రత్యేక కలెక్షన్స్ లక్ష రూపాయల నుంచే ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలియజేశారు. ఈ ప్రదర్శన, అమ్మకం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని, వినియోగదారులు ఈ ప్రదర్శనను వీక్షించి అవకాశాన్ని వినియోగించుకోవాలని వైభవ్ సంస్థ చైర్మన్ గ్రంధి మల్లికా మనోజ్ కోరారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

రణధీర్‌కు పలువురు నివాళి

ప్రజాశక్తి - విశాఖపట్నం : డాక్‌యార్డ్ మాజీ ఉద్యోగి జ్యేష్ట వెంకటేశ్వరరావు కుమారుడు రణధీర్ (33) శుక్రవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. రణధీర్ కొన్ని సంవత్సరాలుగా గ్లకోమా వ్యాధితో బాధ పడుతున్నారు. ఆయన తండ్రి వెంకటేశ్వరరావు సాగర్‌నగర్ ప్రాంతంలో 30 ఏళ్లుగా కుటుంబంతో నివాసం ఉంటున్నారు. వెంకటేశ్వరరావు డాక్ యార్డ్‌లో పనిచేసిన కాలంలో సిఐటియులో కీలకంగా వ్యవహరించారు. గాజువాకలో సిపిఎం, సిఐటియుల్లో చురుగ్గా పనిచేశారు. ఆయన కుటుంబం సిపిఎంతో ఎంతో అనుబంధం కలిగిఉంది. రణధీర్ పార్థివదేహం వద్ద స్థానిక సాగర్‌నగర్, వివేకానందనగర్ వాసులు శనివారం నివాళ్లర్పించారు. అనంతరం అంత్యక్రియలు ఎంవిపి.కాలనీలో జరిగాయి. వర్మ, టిడిపి నాయకులు దొరబాబు, రాజా, అమర్, సిఎన్.బాబు, మౌళి, నవీన్ పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడితే కఠిన శిక్షలు

సిఐ సన్యాసినాయుడు

ప్రజాశక్తి-హుకుంపేట: మెట్టుజోరు పంచాయతి కుంతర్ల గ్రామంలో శనివారం సిఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ బి.సతీష్‌లు గంజాయి సాగు, రవాణాతో తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ ఎస్ సన్యాసినాయుడు మాట్లాడుతూ, డబ్బులకు ఆశపడి గిరిజన యువత అక్రమ మార్గములో గంజాయిని తరలించి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. గంజాయి పంటను పండించడం, అమ్మకం చట్టరీత్యా నేరమన్నారు. నాటు సారా తయారీ, రవాణా, అమ్మకం చేపడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. గంజాయి పంట మానేసి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి ఆదాయం పొందాలనాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని పాత్రికేయులకు మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర రూరల్ జిల్లా అధ్యక్షురాలు కే.కృష్ణకుమారి శనివారం గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఒడిసిపట్టి పాలకులకు, అధికారులకు కనువిప్పు కలిగించి పరిష్కార మార్గానికి పాత్రికేయులు పాటు పడుతున్నారని కొనియాడారు.

కొత్త తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండల తహశీల్దార్‌గా పి. రామారావు శనివారం బదిలీపై వచ్చారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు విశాఖ కలెక్టరేట్‌లో ఇ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ, ఎన్నికల నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లిన రామారావు,క మలి బదిలీలోల భాగంగా భీమిలి తహశీల్దార్‌గా నియమించారు. కాగా స్థానిక తహశీల్దార్ టి గోవింద విజయనగరం జిల్లా పూసపాటిరేగకు బదిలీ చేశారు.

ఆనందపురం: ఆనందపురం తహశీల్దార్‌కు పేర్లి శ్యాంప్రసాద్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలకు ముందు పెందుర్తి తహశీల్దార్‌గా ఉన్న శ్యాంప్రసాద్‌ను విజయనగరం జిల్లా భోగాపురం బదిలీచేశారు. మలి బదిలీల్లో భాగంగా ఇపడు ఆనందపురంలో నియమించగా, తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్త తహశీల్దార్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ అందరి సహకారం, సమన్వయంతో మండల పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు, రెవిన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. తమ వంతు కషి చేస్తానన్నారు. డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, ఆర్ఐ మణికంఠ, విఆర్ఒలు, పలువురు ప్రజాప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆరిలోవ : చినగదిలి రూరల్ తహసిల్దారుగా ఎం.కిరణ్ పాల్ బదిలీపై వచ్చారు. ఎన్నికల సమయంలో శ్రీకాకుళం తహసిల్దారుగా బదిలీపై వెళ్ళి పాల్ కిరణ్‌ను మరలా చినగదిలి తహసిల్దారుగా నియమించారు.

తహశీల్దార్‌కు సత్కారం

కోటవురట్ల: ఏ రంగంలోనైనా చేసిన సేవలే మనిషికి తృప్తినిస్తాయని తహసిల్దారు వెంకటరమణ తెలిపారు. ఆయన బదిలీపై శ్రీకాకుళం వెళ్లడంతో శనివారం తహసిల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. ఆయన ఎన్నికల విధులతో పాటు రైతులకు, సిబ్బందికి విశిష్ట సేవలు అందించారు. అనతి కాలంలోనే అందరి మన్ననలు అందుకున్నారని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, హౌసింగ్ జగన్నాథరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారు నానిబాబు, మండల సర్వేయర్ శ్రీనివాసు, ఆర్ఐ ఊర్ధవరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేయర్లు, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.



కోటవురట్లలో తహశీల్దార్‌ను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది